ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3

తమిళనాడు
TAMILNADU

మంగళవారం 27 మే 2025

ప్రజల జీవితం తామరపువ్వులా వికసిస్తుంది

● బీజేపీ నేత తమిళిసై



సదస్సును ప్రారంభిస్తున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ద్వారా రాష్ట్ర ప్రజల జీవనం తామర పూవులా వికసిస్తుందని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్ రాజన్ వ్యాఖ్యానించారు. తిరువొత్తియూర్‌లో సోమవారం జరిగిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే అంశం సదస్సులో తమిళిసై మాట్లాడుతూ... ఒకే దేశం-ఒకే ఎన్నిక పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేస్తే ఏం చేయాలంటూ కొందరు స్వార్థపూరిత రాజకీయ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. తరచూ పిల్లలకు జన్మనిస్తుంటే తల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని, అలాగే తరచూ ఎన్నికలు వస్తుంటే దేశం ఆర్థికంగా నష్టపోతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక రాష్ట్రాభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రజల జీవనం కూడా అభివృద్ధి చెందుతోందని, ఈ విధానానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని తమిళిసై విజ్ఞప్తి చేశారు. తమిళిసై నేతృత్వం వహించిన ఈ సదస్సులో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, జాతీయ కార్యదర్శులు అనిల్ ఆంటొనీ, అరవింద్ మేనన్, తమిళనాడు-కర్నాటక కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీనియర్ నేతలు కేఎస్ రాధాకృష్ణన్, ఎం.చక్రవర్తి, అర్జునమూర్తి, అమర్ ప్రసాద్ రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

రాజకీయాల్లో విజయ్ బచ్చా

● మంత్రి దురైమురుగన్



చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్‌పై రాష్ట్ర మంత్రి దురైమురుగన్ కటువైన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో విజయ్ ఒక 'బచ్చా' అని మండిపడ్డారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనడంపై విజయ్ విమర్శలు గుప్పించిన విషం తెలిసిందే. ఈడీ తనిఖీలకు భయపడే సీఎం ఆ సమావేశానికి వెళ్లారని, తమ కేసుల గురించి ప్రధాని వద్ద ప్రస్తావించలేదని చెప్పగలరా అంటూ విజయ్ సీఎంను ప్రశ్నించారు. ఢిల్లీ సమావేశం సందర్భంగా వెలువడిన ఫొటోలు డీఎంకే-మధ్య అవగాహన కుదిరినట్లు చెబుతున్నాయని ఎద్దేవా చేశారు. సోమవారం రాణీపేటకు వచ్చిన మంత్రి దురైమురుగన్‌ను మీడియా విజయ్ విమర్శలను ప్రస్తావించగా.. 'బచ్చా ఇన్ పాలిటిక్స్' అంటూ కటువుగా వ్యాఖ్యానించారు.

53 ఏళ్ల తరువాత నైరుతి తీవ్రరూపం

● నీలగిరి, కోవై జిల్లాల్లో ఆగని వర్షం
● స్తంభించిన జనజీవనం



కోవై జిల్లా వరట్టుపారై వద్ద పెనుగాలులకు వంగిన విద్యుత్ స్తంభం



ఉప్పిలిపాళ్యంలో రోడ్డు పక్కన కాల్వలో బోల్తాపడిన కారు

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 53 యేళ్ల తర్వాత నైరుతి రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చటంతో నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గత మూడు రోజులుగా ఆ జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. నీలగిరిలో 24 గంటల వ్యవధిలో 35 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కున్నూరులోనూ పెనుగాలులతో కురిసిన భారీ వర్షాలకు రహదారుల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు ఆది, సోమవారాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం ఈ రెండు జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం కూడా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కోవై జిల్లాలోని చిన్నకల్లార్ ప్రాంతం వద్ద 21 సెంమీల వర్షపాతం నమోదైంది.

భారీ వర్షాల కారణంగా ఆ జిల్లాలోని వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. పిల్లూరు డ్యామ్‌లో ఆదివారం హఠాత్తుగా నీటిమట్టం 97 అడుగులకు పెరిగింది. ఆ డ్యామ్ నుంచి సెకనుకు 18 వేల ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆనీతూరు మేట్టుపాళయం భవానీ వాగులో చేరడంతో వరద పరిస్థితులను తలపిస్తున్నాయి. నీలగిరి జిల్లాలో ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. పెనుగాలుల కారణంగా ప్రధాన రహదారుల్లో 50 చోట్ల చెట్లు కూలిపడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల రహదారులపై మట్టి చరియలు కూడా విరిగిపడ్డాయి. ఆదివారం ఊటీలో చెట్టు కూలిపడిన సంఘటనలో 15 యేళ్ల బాలుడు మృతి చెందటంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఊటీలోని పర్యాటక ప్రాంతాలన్నీ మూసివేశారు. పర్యాటకులు వర్షాల కారణంగా తమ విహారయాత్ర ముగించుకుని స్వస్థలాలకు బయలు దేరుతున్నారు. ఇదిలా ఉండగా ఉప్పిలిపాళయంలో వాననీటిలో వెళ్ళిన ఓ లగ్జరీ కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తాకొట్టింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ మణికంఠన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అటు అరేబియా సముద్రంలో, ఇటు బంగాళాఖాతంలో అల్ప పీడనాలు, వాటికి తోడుగా ముందే వచ్చిన నైరుతి రుతుపవనాలతో రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో ప్రస్తుతం ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి.

నిండుకుండలా పిల్లూరు డ్యామ్...

కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపంలోని పిల్లూరు జలాశయం భారీ వర్షాల కారణంగా నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరింది. దీంతో భవానీ నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. పిల్లూరు జలాశయంలో వందడుగుల వరకు జలాలను నిల్వచేయడానికి వీలుంది. సోమవారం ఉదయం ఆ జలాశయంలో నీటిమట్టం 97 అడుగులకు పెరిగింది. సోమవారం రాత్రికల్లా ఆ జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆ జలాశయం నుండి సెకనుకు 18 వేల ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ఆ జలాలన్నీ భవానీ నదిలో చేరుతుండడంతో నదీతీరంలోని లోతట్టు ప్రాంతాలైన నెల్లితురై, మేట్టుపాళయం, శ్రీరంగరాయన్ ఓడై, సిరుముగై, ఆలంకొంబు, వశీనం పాళయం ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలంటూ పోలీసులు దండోరా వేయించి మరీ హెచ్చరిస్తున్నారు.





కున్నూరు వద్ద ఇంటిపై పడిన మట్టి పెళ్లలను పరిశీలిస్తున్న విపత్తుల నిర్వహణ బృందం - మేట్టుపాళయం వద్ద రహదారిపై కూలిపడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక దళం

రాష్ట్రంలో కొత్తగా 11 డిగ్రీ కళాశాలలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త కళాశాలలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటైన 11 ఆర్ట్స్ సైన్స్ కళాశాలలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ కళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుండే పనిచేయనున్నాయి. కడలూరు జిల్లా బన్రూట్టి, నీలగిరి జిల్లా కున్నూరు, దిండుగల్ జిల్లా నత్తం, చెన్నై జిల్లాలో ఆలందూరు, విల్లుపురం జిల్లాలో విక్రవాండి, చెంగల్పట్టు జిల్లా సెయ్యూరు, శివగంగ జిల్లాల మానామదురై, తిరువారూరు జిల్లా ముత్తుపేట, తంజావూరు జిల్లా తిరువిడైమరుదూరు, పెరంబలూరు జిల్లా కొల్లానత్తం, తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారంలో ఏర్పాటైన కళాశాలలను సోమవారం ఉదయం చెన్నై సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కళాశాలలు ఐదు పాఠ్యాంశాలతో ప్రారంభించామని, ప్రతి కళాశాలలో 12 మంది అధ్యాపకులు చొప్పున 11 కళాశాలలకు 132 మంది అధ్యాపకులను, 154 మంది బోధనేతర సిబ్బందిని నియమించినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ 11 కళాశాలల్లోనూ యేడాదికి 3050 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నామని, మూడేళ్లలో విద్యార్థుల సంఖ్య 9150కి పెరుగుతుందని వివరించారు. ఈ 11 కళాశాలలతో రాష్ట్రంలో నడుపుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఖ్య 176కు పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కోవి చెళియన్, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సి.సమయమూర్తి, కళాశాలల విద్యా సంచాలకులు ఎ.సుందరవళ్ళి, ప్రజాపనుల శాఖ చీఫ్ ఇంజనీర్ వి.సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు. 11 ప్రాంతాల్లో జరిగిన కళాశాలల ప్రారంభోత్సవాల్లో మంత్రులు పెరియకరుప్పన్, దామో అన్బరసన్, సామినాథన్, ఆర్ చక్రపాణి, శివశంకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల బాండ్ల జారీ...

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో రూ.200 కోట్ల విలువైన బ్యాండ్ల జారీ కార్యక్రమం చేపాక్ కలైవానర్ అరంగంలో సోమవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ బాండ్లను లిస్టింగ్ చేస్తూ స్టాలిన్ సభా వేదికపైనున్న గంట మోగించారు. ఈ బాండ్ల జారీకి సహకరించిన ఏజెంట్లు, ప్రమోటర్లకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియా, శాసనసభ్యుడు ఎంకే మోహన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చీఫ్ ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ తీర్థంకర్ పట్నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఉదయచంద్రన్, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు స్థానాల భర్తీ కోసం... 19న రాజ్యసభ ఎన్నికలు

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనుండటంతో ఆయా స్థానాల భర్తీకోసం జూన్ 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్న పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి, డీఎంకేకి చెందిన షణ్ముగం, మహమ్మద్ అబ్దుల్లా, పి.విల్సన్, వైగో (ఎండీఎంకే అధినేత), అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్ పదవీ కాలం జూలై 24తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ ఆరు స్థానాల ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ప్రకటన ప్రకారం జూన్ 2న నోటిఫికేషన్ విడుదలవుతుంది. జూన్ 9న నామినేషన్ల స్వీకరణ, 10న పరిశీలన జరుగుతాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు జూన్ 12తో ముగుస్తుంది. ఈ ఎన్నికల్లో ఆరుగురి కంటే ఎక్కువమంది నామినేషన్లు వేస్తే జూన్ 19న పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ 19 ఉదయం 9కి ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల ప్రక్రియ జూన్ 23లోగా ముగించాలని, ఈ ఎన్నికల నిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహించనున్న శాసనసభ కార్యదర్శికి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

కమల్‌కు ఛాన్స్...

రాష్ట్రం నుండి రాజ్యసభకు ఎంపిక కావాలంటే 34 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. డీఎంకే కూటమికి 159 మంది శాసనసభ్యులుండటంతో ఆ పార్టీ తరఫున నలుగురు సునాయాసంగా రాజ్యసభకు ఎన్నికవుతారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మక్కల్ నీది మయ్యం నాయకుడు కమల్‌హాసన్‌కు రాజ్యసభ సీటు కేటాయించనున్నారు. డీఎంకే తరఫు సీనియర్ న్యాయవాది విల్సన్‌కు, అబ్దుల్లాకు మళ్ళీ సీటిచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీరిలో అబ్దుల్లా డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి వీరాభిమాని, అనుచరుడు. ఎండీఎంకే నేత వైగోకు ఈసారి రాజ్యసభ సీటు లభించడం అనుమానంగానే వుంది. వైగోకు బదులుగా మక్కల్ నీదిమయ్యం నేత కమల్ హాసన్‌ను ఎంపికచేయాలని డీఎంకే అధిష్టానం నిర్ణయించింది. డీఎంకే కార్మిక సంఘానికి చెందిన నేతల్లో ఒకరికి రాజ్యసభ సీటు కేటాయించడం ఆనవాయితీ. ఆ ప్రకారం డీఎంకే కార్మిక సంఘమైన తొళిలాలర్ మున్నేట్ర కళగం కోశాధికారి నటరాజన్‌కు ఓ సీట కేటాయించడం ఖాయమని తెలుస్తోంది.

అన్నాడీఎంకేలో...

శాసనసభలో అన్నాడీఎంకేకు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన ఎమ్మెల్యేల సహా 66 మంది శాసనసభ్యులున్నారు. అన్నాడీఎంకే తరఫున ఒకరిని రాజ్యసభకు ఎంపిక చేయడానికి అవకాశం ఉంది. మరొకరిని రాజ్యసభకు ఎంపిక చేయాలంటే అన్నాడీఎంకే అసమ్మతి వర్గంగా వ్యవహరిస్తున్న ఒ.పన్నీర్‌సెల్వం, మనోజ్ పాండ్యన్, వైద్యలింగం, ఉసిలంపట్టి అయ్యప్పన్ మద్దతు ప్రకటించినా, మరొక సభ్యుడి మద్దతు అవసరం అవుతుంది. ఓపీఎస్ వర్గం మద్దతు లేకుండా ఈపీఎస్ తన దగ్గరున్న 63 మంది శాసనసభ్యులతోపాటు బీజేపీ శాసనసభ్యులు నలుగురి మద్దతు తీసుకున్నప్పటికీ మొత్తం సభ్యుల సంఖ్య 67కు చేరుతుంది. మరొక శాసనసభ్యుడి మద్దతు ఉంటేనే రెండో వ్యక్తిని రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడానికి వీలుపడుతుంది. ఒక వేళ పీఎంకే అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకుంటే ఆ పార్టీ మద్దతుతో ఇద్దరిని రాజ్యసభకు ఎంపిక చేయడానికి వీలుపడుతుంది. ఇంత జరిగినా ఒక వేళ బీజేపీ గనుక రాజ్యసభ సీటు కావాలని ఒత్తిడి చేస్తే ఈపీఎస్ ఇరకాటంలో పడటం ఖాయం. ప్రస్తుతం అన్నాడీఎంకేలో రాజ్యసభ సీటు కోసం మాజీ మంత్రులు డి. జయకుమార్, విజయభాస్కర్ పోటీపడుతున్నారు. డీఎండీకే నాయకురాలు ప్రేమలత కూడా అన్నాడీఎంకే నుంచి రాజ్యసభ స్థానాన్ని గట్టిగా ఆశిస్తున్నారు. అయితే ఈపీఎస్ మాత్రం ఈ విషయమై ఇప్పటికీ మౌనం పాటిస్తున్నారు. దీనిని బట్టి బీజేపీ, పీఎంకే శాసనసభ సభ్యుల మద్దతుతో తమ రెండు రాజ్యసభ స్థానాలను తామే నిలుపుకోవాలని ఈపీఎస్ కృతనిశ్చయంతో ఉన్నారు. అయితే కూటమి పార్టీలతో కూడిన ప్రణాళిక ఏ మేరకు ఫలిస్తుందో వేచిచూడాల్సివుంది. ఈ ఆరు స్థానాలకు గాను ఐదు ఏకగ్రీవమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ, పీఎంకే, ఓపీఎస్ వర్గం అన్నాడీఎంకేతో చేతులు కలపని పక్షంలో ఒక స్థానానికి ఎన్నిక జరిగే అవకాశముంది.

టాస్మాక్‌లో ఏదో జరుగుతోంది...!

● హైకోర్టు మదురై బెంచ్



చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు పరిశీలిస్తే, టాస్మాక్‌లో ఏదో జరుగుతోందని తెలుస్తోందని హైకోర్టు మదురై ధర్మాసనం వ్యాఖ్యానించింది. మదురైకి చెందిన మాయకన్నన్, మురుగన్, రామస్వామి హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో టాస్మాక్ వ్యవహారంపై పలు ఆరోపణలు చేశారు. తాము మదురై జిల్లాలో టాస్మాక్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నామని, టాస్మాక్‌లో జరుగుతున్న మామూళ్ల వసూళ్లపై ఫిర్యాదు చేయడంతో పాటు మీడియా సమావేశంలోనూ తెలియజేశామన్నారు. టాస్మాక్ సంస్థకు కళంకం తెచ్చేలా విలేఖరుల సమావేశం నిర్వహించారనే కారణంగా తమను విధుల నుంచి తొలగించారన్నారు. చట్టవిరుద్ధమైన ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ సోమవారం న్యాయమూర్తి పుహళేంది నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ... మదురై జిల్లా టాస్మాక్ మేనేజర్లుగా పనిచేస్తున్న రాజేశ్వరి, తిరుమంగళం టాస్మాక్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సెల్వం కలసి ప్రతిరోజు ఒక దుకాణం నుంచి రూ.5 వేలు వసూలుచేస్తున్నారన్నారు. ఈ విషయమై పిటిషనర్లు అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మీడియా సమావేశం నిర్వహించి, తమ ఇబ్బందులు తెలిపారని వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. కల్తీ సారా, నకిలీ మద్యంతో సంభవిస్తున్న మరణాలను అడ్డుకొనేందుకే రాష్ట్ర ప్రభుత్వం మద్యం విక్రయాలు చేపట్టిందని, అలాంటి శాఖలో అవినీతికి చోటివ్వరాదని పేర్కొంది. అవినీతి ఆరోపణలకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తే, టాస్మాక్‌లో ఏదో జరుగుతోందని అవగతమవుతోందని వ్యాఖ్యానించింది. టాస్మాక్ సంస్థ తమ తప్పులు గ్రహించాల్సిన అవసరముందని పేర్కొంది. పిటిషనర్లను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

దుకాణాల తొలగింపు.. అంబత్తూర్ ఎస్టేట్‌లో ఉద్రిక్తత

● వ్యాపారుల ఆత్మహత్యాయత్నం

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అంబత్తూర్ ఎస్టేట్‌లో రోడ్డు పక్కనున్న దుకాణాల తొలగింపు ఉద్రిక్తతకు దారి తీసిది. ఈ నెల 23న సిడ్కో మేనేజర్ విమల నేతృత్వంలో ఉద్యోగులు, వందకు పైగా రోడ్డు సైడ్ దుకాణాలు తొలగించడంతో పాటు దుకాణాల్లో ఉన్న సరుకులు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, దుకాణాల తొలగింపును నిరసిస్తూ, ఎత్తుకెళ్లిన సరుకులు, వస్తువులు తిరిగి అప్పగించాలని సోమవారం ఉదయం వ్యాపారులు అంబత్తూర్ ఎస్టేట్ బస్టాండ్ సమీపంలోని సిడ్కో కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందున్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో సుమారు 50 మంది బస్టాండ్ ఎదుట ఉన్న రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఆందోళనకారులతో పోలీసులు చర్చలు జరుపుతున్న సమయంలో వ్యాపారులు-పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అంతలో కొందరు వ్యాపారులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని బెదిరించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ ఆందోళన కారణంగా ఆ ప్రాంతంలో రాకపోకలు స్తంభించడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. ఆందోళనకారులను శాంతింపజేసిన పోలీసులు, వారిని చర్చల కోసం సిడ్కో కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ విషయమై వ్యాపారులు మాట్లాడుతూ... 30 ఏళ్లుగా తాము ఈ ప్రాంతంలో దుకాణాలు నడుపుతున్నామని, చెన్నై కార్పొరేషన్ కూడా తమకు గుర్తింపుకార్డులు ఇచ్చిందన్నారు. కానీ, ప్రైవేటు సంస్థల ఒత్తిళ్ల కారణంగా సిడ్కో తమ దుకాణాలు తొలగించేందుకు సిద్ధపడిందని ఆరోపించారు. స్వాధీనం చేసుకున్న సరుకులు, పరికరాలివ్వాలని, దుకాణాలు ధ్వంసం చేసినందుకు నష్టపరిహారం చెల్లించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు.

సమాచార దర్శిని

ప్రభుత్వ మహిళా ఐటీఐలో అడ్మిషన్లు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో ఉన్న మహిళా ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో 2025వ సంవత్సరానికి ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉచిత శిక్షణ, ఉచిత ల్యాప్‌టాప్, సైకిల్, బస్ పాస్ తదితరాలు అందజేయనున్నారు. ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ సహా పలు వృత్తి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://skill-training.tn.gov.in/index.html అనే వెబ్‌సైట్‌లో జూన్ 13వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

వెటర్నరీ కోర్సుల్లో ....

వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ సోమవారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైంది. ఈ మేరకు వెటర్నరీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ నరేంద్ర బాబు విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు వెటర్నరీ వైద్య పరిశోధన విశ్వవిద్యాలయం పరిధిలో చెన్నై, నామక్కల్, తిరునల్వేలి, ఒరత్తనాడు, తలైవాసల్, ఉడుమలైపేట, తేని తదితర ప్రాంతాల్లోని వెటర్నరీ కళాశాలల్లో ఐదేళ్ల బీవీఎస్సీ ఏహెచ్ వెటర్నరీ వైద్యం, సంరక్షణ కోర్సుల్లో 660 సీట్లున్నాయి. తిరువళ్లూర్ జిల్లా కొడువెలిలోని ఫుడ్ అండ్ డైరీ టెక్నాలజీ కళాశాల, హోసూరులోని పౌల్ట్రీ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నాలుగేళ్ల బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, డైరీ టెక్నాలజీ, పౌల్ట్రీ టెక్నాలజీ కోర్సులు అందిస్తున్నారు. ఈ సీట్లలో 7.5 శాతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేటాయించారు. ప్లస్ టూలో గణితం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 20వ తేది సాయంత్రం 5 గంటల్లోపు https://adm.tanuvas.ac.in/ అనే వెబ్‌సైట్‌లో దరకాస్తు చేసుకోవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 2.43 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలోని 440కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు 2 లక్షలకు పైగా సీట్లున్నాయి. 2025-26వ సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7వ తేది ప్రారంభమైంది. విద్యార్థులు జూన్ 6వ తేదిలోగా www.tneaonline.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కాగా, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2.43 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. గత ఏడాది 2.53 లక్షల దరఖాస్తులు నమోదయ్యాయి. దరఖాస్తు స్వీకరణకు ఇంకా 12 రోజులు సమయం ఉండడంతో దరఖాస్తు సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

18న భారత సైన్యాన్ని గౌరవించేలా క్విజ్ పోటీలు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యాన్ని గౌరవించేలా నావికాదళం, సైనిక చరిత్ర సహా ఏడు అంశాలపై ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. XQuiz అనే క్విజ్ పోటీ సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్విజ్ ఫెస్టివల్ పోటీ జూన్ 18 నుంచి 24వ తేది వరకు ఏడు రోజులు జరుగనున్నాయి. భారత సైన్యానికి గౌరవ సూచకంగా, భారత సాయుధ దళాల విభాగాలు, వైమానిక దళం, సైన్యం, నౌకాదళం, భారత యుద్ధ చరిత్ర, ముఖ్యమైన యంత్రాలు, సాహస సైనికులకు సెల్యూట్ చేయడం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఒక్కో అంశంపై అడిగే 15 ప్రశ్నలకు నిమిషంలో సమాధానం నమోదు చేయాల్సి ఉంటుంది. పోటీలు ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పాల్గొనవచ్చు. ఒకసారి వెబ్‌సైట్ లాగిన్ అయితే పోటీ ముగిసిన తర్వాత లాగ్ ఔట్ అవ్వాల్సి ఉంటుంది. రూ.500 ఫీజు చెల్లించాలి. ఏడు రోజులు వరుసగా పాల్గొని విజేతలుగా నిలిచిన మాత్రమే బహుమతులు ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు 9841270711 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రాకపోకలు తెలిసేలా బస్టాపుల్లో డిజిటల్ బోర్డులు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధాన మార్గాల్లో, ఒకే సమయంలో వరుసగా మూడు ఎంటీసీ బస్సులు వెళ్తుంటాయి. నిర్ణీత సమయంలో బస్సులు రావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాపుల్లో గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోందని వారు వాపోతున్నారు. ఈ విషయమై ఎంటీసీ అధికారులు మాట్లాడుతూ... ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రాజెక్ట్ కింద 'సిటీ బస్ సిస్టమ్' అనే కొత్త వ్యవస్థ రూపొందిస్తున్నామన్నారు. బస్సుల రాకపోకలు ప్రయాణికులు తెలుసుకొనేలా 500 బస్టాపులు, 71 బస్టాండ్లలో ఎల్‌ఈడీ డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో కూడా 'చలో' అనే యాప్ ద్వారా బస్సుల రాకపోకల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా అన్నాసాలైలోని రెండు బస్టాపుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేశామని, తదుపరి మొత్తం 500 బస్టాపుల్లో ఈ బోర్డులో ఏర్పాటుచేయనున్నామని, సెప్టెంబరు చివరి నాటికి అన్ని ప్రాంతాల్లో డిజిటల్ బోర్డులు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

ఈపీఎస్ నివాసానికి బాంబు బెదిరింపు


సేలంలోని ఎడప్పాడి నివాసం

టి.నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): సేలం శూరమంగళం నెడుంజాలై నగర్‌లోని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నివాసానికి బాంబు బెదిరింపులు రావటంతో పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ ముమ్మర తనిఖీలు జరిపారు. ఈపీఎస్ ఆదివారం ఉదయం చెన్నై నుంచి బయలుదేరి కోయంబత్తూరుకు వెళ్ళారు. అక్కడ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత ఆయన కారులో సేలం బయలుదేరారు. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఆయన సేలంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ నేపథ్యంలో చెన్నైలోని పోలీసు కంట్రోలు రూమ్‌కు ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఓ ఈమెయిల్ సందేశం వచ్చింది. అందులో సేలంలోని ఈపీఎస్ నివాసగృహంలో బాంబులున్నాయని, కాసేపట్లో అవి పేలుతాయని బెదరింపులుండటం చూసి కంట్రోలు రూమ్ అధికారులు వెంటనే సేలం మహానగర పోలీసు కమిషనర్ ప్రవీణ్ కుమార్ అభినవ్‌కు సమాచారం పంపించారు. దీంతో అప్రమత్తమైన పోలీసు కమిషనర్ పోలీసులు జాగిలాలు, బాంబ్‌స్క్వాడ్‌తో హుటాహుటిన రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఈపీఎస్ నివాసానికి వెళ్ళి తనిఖీలు జరిపారు. ఆ నివాసంలోని అన్ని గదులు, కారు షెడ్డులోనూ తనిఖీ చేసి, అది ఉత్తుత్తి బాంబు బెదరింపు అని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని బాంబు బెదరింపు ఈమెయిల్ పంపిన దుండగుల ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 16 మంది మేజిస్ట్రేట్ల బదిలీ

టి.నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన అత్యాచారం కేసు విచారణ జరిపిన పోక్సో ప్రత్యేక కోర్టు' మేజిస్ట్రేట్ ఎం.రాజలక్ష్మి సహా 16 మంది మేజిస్ట్రేట్‌లను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎస్.అల్లి ఉత్తర్వు జారీ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల వ్యవహారాల అధికారిగా పనిచేస్తున్న లింగేశ్వరన్‌ను మైలాడుదురై జిల్లా జడ్జిగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వును నిలిపివేసి ఆయనను చెన్నై లేబర్ కోర్టు మేజిస్ట్రేట్‌గా నియమించారు. వేలూరు ఫాస్ట్ ట్రాక్ కోర్టు మేజిస్ట్రేట్ గాయత్రి చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టు-2 మేజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు. పూందమల్లి అదనపు జిల్లా జడ్జి బాలకృష్ణన్ రాష్ట్ర న్యాయ వ్యవహారాల కమిషనరేట్ మెంబర్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. రాష్ట్ర న్యాయవ్యవహారాల కమిషనరేట్ మెంబర్ సెక్రటరీగా పనిచేసిన కె.సుధ మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ (పరిశీలన)గా నియమితులయ్యారు. చెన్నై పోక్సో ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ ఎం.రాజలక్ష్మి చెన్నై ప్రిన్సిపల్ అదనపు మాదకద్రవ్యాల నిరోధక విభాగం కోర్టు మేజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు. ఈమె అన్నా విశ్వవిద్యాలయం విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు విచారణ జరిపారు. ఆ కేసుకు సంబంధించి ఈ నెల 28న ఆమె తీర్పు ఇచ్చిన తర్వాత మాదకద్రవ్యాల నిరోధక విభాగం కోర్టు మేజిస్ట్రేట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. రామనాథపురం అదనపు జిల్లా జడ్జి రోహిణి మదురైలోని ఖనిజవనరులకు సంబంధించిన కేసులు విచారించే ప్రత్యేక కోర్టుకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు అక్కడ పనిచేసిన మేజిస్ట్రేట్ లోకేశ్వరన్ మదురై మాదకద్రవ్యాల స్మగ్లింగ్ నిరోధక విభాగం కోర్టుకు బదిలీ అయ్యారు. ఇదే విధంగా కడలూరు పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి లక్ష్మీ రమేష్ చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టు 6వ అదనపు ప్రిన్సిపల్ జడ్జిగా నియమితులయ్యారు. పుదుచ్చేరి ప్రభుత్వ లా కమిషనర్ కార్యదర్శిగా ఉన్న ఎల్ఎస్.సత్యమూర్తి మైలాడుదురై జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. సేలం మహిళా కోర్టు జడ్జి పుగళేంది సేలం 3వ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. కడలూరు అంటరాని తనం నిరోధక విభాగం ప్రత్యేక కోర్టు జడ్జి రామనాథన్, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల వ్యవహారాల అధికారిగా నియమించారు. మదురై ప్రిన్సిపల్ అదనపు జిల్లా జడ్జి నాగలక్ష్మి మదురై మోటారు వాహన ప్రమాదాల కేసులపై విచారణ జరిపే ప్రత్యేక జిల్లా కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. శ్రీవిల్లిపుత్తూరు మహిళా కోర్టు జడ్జి ఆబ్రహం లింకన్ చెన్నై సిటీ సివిల్ కోర్టు 18వ అదనపు జడ్జిగా బదిలీ అయ్యారు. మదురై 3వ అదనపు జిల్లా జడ్జి మాధవరామానుజం తిరునల్వేలి లోక్ అదాలత్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కుళిత్తురై అదనపు జిల్లా జడ్జి గోత్రామేరీ చెన్నై సిటీ సివిల్ కోర్టు 20వ అదనపు జడ్జిగా బదిలీ అయ్యారు. నాగపట్టినం పోక్సో కోర్టు జడ్జి ఉమామహేశ్వరి తిరువళ్లూరు పోక్సో కోర్టు జడ్జిగా నియమితులయ్యారు.

ప్లస్ టూ విద్యార్థినికి గర్భం

● సహ విద్యార్థి అరెస్ట్

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ విద్యార్థినికి గర్భం చేసి సహ విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైలాడుదురై జిల్లాలోని ఓ పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్న విద్యార్థికి తనతో చదివే 16 ఏళ్ల విద్యార్థినితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఏడాది కాలంగా వారు ప్రేమలో మునిగి తేలుతున్నారు.. కొద్దిరోజుల క్రితం విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు చికిత్స కోసం ప్రభుత్వానికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆ విద్యార్థిని ఆరు నెలల గర్భంతో ఉందని తేల్చారు. దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు విద్యార్థిని గర్భానికి కారణమైన ఆ బాలుడిని పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎస్ఐ మృతి

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎస్ఐ మృతిచెందిన ఘటన కళ్లకుర్చి జిల్లాలో చోటుచేసుకుంది. చిన్నసేలం సమీపం నాయప్పనూర్ గ్రామానికి చెందిన స్వామినాథన్ మనలూరుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకున్న ఆయన, ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరాడు. కీరనూరు ఫ్లై ఓవర్ సమీపం చెన్నై-సేలం జాతీయ రహదారిలో వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో స్వామినాథన్ ఘటనా స్థలంలోనే మృతిచెందారు.. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న కళ్లకుర్చి పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదుచేసి, ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీ పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

ప్లస్ వన్ విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ప్లస్ వన్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుప్పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. తిరుప్పూర్ కార్పొరేషన్ కాలేజ్ రోడ్డు కల్లంపాళయం ప్రాంతానికి చెందిన టైలర్ సురేష్‌కుమార్ కుమారుడు మనోఆదిత్య (16) ప్రైవేటు పాఠశాలలో ప్లస్ వన్ చదువుతున్నాడు. ఈ నెల 16న విడుదలైన ప్లస్ వన్ ఫలితాల్లో ఆదిత్య రెండు సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. దీంతో, కొద్దిరోజులుగా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉంటున్న ఆ బాలుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

సీబీసీఐడీకి పంచాయతీ అధ్యక్షుడిపై దాడి కేసు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతి అధ్యక్షుడిపై దాడి కేసు సీబీసీఐడీ విచారణకు బదిలీ చేస్తూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. కళయార్‌కోయిల్ సమీపం మారంధై పంచాయతి అధ్యక్షుడు, అతడి కుటుంబంపై దాడి జరిగిందంటూ మదురై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి పరాజయం పొందిన వరదరాజన్, అతడి మద్దతుదారులు తనపై దాడిచేశారని పంచాయతి అధ్యక్షుడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. పిటిషనర్ ఆరోపణలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు, కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేసింది.

ఫుట్ బోర్డు నుంచి జారిపడి కండక్టర్ మృతి

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బోర్డు నుంచి జారిపడి కండక్టర్ మృతిచెందిన ఘటన మదురైలో చోటుచేసుకుంది. మదురై నుంచి తంజావూరుకు ఆదివారం రాత్రి ప్రభుత్వ బస్సు 30 మందికి పైగా ప్రయాణికులతో బయల్దేరింది. బస్సు కండక్టర్‌గా పుదుకోట జిల్లా వీసలూరు ప్రాంతానికి చెందిన కరుప్పయ్య విధులు నిర్వహిస్తున్నాడు. బస్సు బయల్దేరిన తర్వాత కరుప్పయ్య ప్రయాణికుల నుంచి ఛార్జీ వసూలుచేస్తున్నాడు. మదురై శివారు ఒత్తుకడై ప్రాంతంలో బస్సు వేగంగా వస్తోంది. రోడ్డుపై స్పీడ్ బ్రేకరు గుర్తించిన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో, టిక్కెట్లు ఇస్తున్న కరుప్పయ్య అదుపుతప్పి ఫుట్ బోర్డు నుంచి కిందకు పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతడిని ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా, 20 నిముషాలు దాటినా అంబులెన్స్ రాకపోవడంతో, చుట్టుపక్కల వారు ఆటోలో మదురై ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పెరిగిన పవన విద్యుదుత్పత్తి

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో వీస్తున్న గాలుల కారణంగా రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి పెరిగింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 3,252 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి జరిగింది. కాగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం రాష్ట్ర విద్యుత్ వినియోగం 13,905 మెగావాట్లుగా నమోదైందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

ప్రియురాలిపై దాడి చేసి యువకుడి ఆత్మహత్య


సబీనా, సురేష్ (ఫైల్‌ఫోటో)

వేలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా చిన్నఅల్లాపురానికి చెందిన సబీనా బాను (33)గత రెండేళ్ళుగా తన భర్త ఛాన్‌భాషాతో గొడవల కారణంగా తన పుట్టింట్లో ఉంటూ, ఓ దుకాణంలో పని చేస్తోంది. ఈ క్రమంలో కొన్నాళ్లుగా అదే షోరూంలో పనిచేస్తున్న సురేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో, గత వారం సురేష్‌తో మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆదివారం రాత్రి 11.30 గంటలకు సబీనా ఇంటికి వచ్చిన సురేష్ పక్కనేవున్న ఇనుపరాడ్డుతో సబీనాను బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. తర్వాత తన ఇంటికి వెళ్ళిన సురేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి, విచారణ చర్యలు చేపట్టారు.

నగరంలో మళ్లీ 'బైక్ రేస్'

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలను భయభ్రాంతులను చేసేలా, ప్రమాదాలకు తావిచ్చేలా 'బైక్ రేస్'లు మళ్లీ ప్రారంభం కావడం కలకలం రేపుతోంది. శనివారం అర్ధరాత్రి కోయంబేడు నుంచి అడయార్ వరకు సుమారు పది మందికి పైగా యువకులు బైక్ రేస్‌లో పాల్గొన్నారు. అతివేగంగా, రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్తున్న బైక్‌లను చూసి వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అర్ధరాత్రి 12 గంటల తరువాత ఓ ప్రాంతంలో చేరిన యువకులు, ఒంటి గంట తర్వాత రేస్‌లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, 10 కి.మీ దూరాన్ని మూడు నిమిషాల్లో చేరుకోవాలి, బైక్ వేగం 120 నుంచి 130 కి.మీ పైగా ఉండాలి సహా పలు ప్రమాదకర నిబంధనలతో ఈ రేస్ నిర్వహించారు. విజేతలకు రూ.20 వేలు బహుమతిగా నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, బైక్ ప్రారంభం నుంచి ముగిసే వరకు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయడం ఆందోళన కలిగించింది. ఈ విషయమై ట్రాఫిక్ విభాగం అధికారి ఒకరు మాట్లాడుతూ... బైక్ రేస్‌లో పాల్గొన్న వాహనాలకు రిజిస్ట్రేషన్ నెంబరు ప్లేట్లు లేవన్నారు. అయినా, ట్రాఫిక్ విజిలెన్స్ పోలీసులు, రేస్‌ల్లో పాల్గొన్న యువకులను గుర్తించే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిపారు. కోయంబేడు-అడయార్ వరకు ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించామని, అన్నానగర్‌కు చెందిన ఐదుగురిని గుర్తించి, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. రేస్‌లకు పాల్పడిన వారికి తలా రూ.10వేల జరిమానా విధించడంతో పాటు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికలకు సిద్ధం కండి

● కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపు



వేలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ప్రతి కార్యకర్త సన్నద్ధమవ్వాలని ఎమ్మెల్యే నందకుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వేలూరు జిల్లా డీఎంకే కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నందకుమార్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. డీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యత లేని ఆహారం అందజేసిన జొమాటో

● బాధితుడికి రూ.30 వేలు చెల్లించాలని కమిషన్ ఉత్తర్వులు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురైన పిటిషనర్‌కు జొమాటో, సంబంధిత రెస్టారెంట్ రూ.30 వేలు పరిహారంగా చెల్లించాలని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశించింది. మడిపాక్కంకు చెందిన జగప్రభు అనే వ్యక్తి వేళచ్చేరిలోని అర్జున్ ఆంధ్ర మెస్‌లో మాంసాహార భోజనం కోసం జొమాటో ద్వారా ఆర్డర్ చేశాడు. ఆహారం తీసుకున్న జగప్రభు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం, ఛాతి నొప్పి తదితర సమస్యలతో ఇబ్బంది పడి, ఆసుపత్రిలో చికిత్స పొంది రెండు రోజుల తర్వాత డిశ్చారి అయ్యాడు. ఈ విషయమై బాధితుడు జగప్రభు పిటిషన్‌తో కమిషన్ ఈ ఉత్తర్వులు జారీచేసింది.

రేపటి నుంచి నేర్మైనగర్ శ్మశానవాటిక మూసివేత

వాషర్‌మెన్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): జీసీసీ పరిధిలోని నేర్మై నగర్ శ్మశానవాటిక మరమ్మతుల నిమిత్తం ఈనెల 28 నుంచి జూన్ 4వ తేది వరకు మూసివేయనున్నారు. తిరువిక నగర్ మండలం 66వ వార్డులో పనిచేస్తున్న నేర్మై నగర్ శ్మశానవాటికను మరమ్మతుల కారణంగా మూసివేస్తున్న కారణంగా, ఆ సమయంలో ప్రజలు 67వ వార్డులో ఉన్న తాంగల్ శ్మశాన వాటిక వినియోగించుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

జీసీసీకి ప్రత్యేక విపత్తు నిర్వహణ అథారిటీ

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కు ప్రత్యేక విపత్తు నిర్వహణ అథారిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వరదలు, తుఫాను తదితర విపత్తుల సమయాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా పర్యవేక్షించేందుకు ఈ అథారిటీ ఏర్పాటైంది. విపత్తుల అథారిటీలో జీసీసీ, చెన్నై పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం, ఆరోగ్య శాఖ, సీఎండీఏ, నీటిపారుదల శాఖ తదితర శాఖలున్నాయి. అధ్యక్షుడిగా జీసీసీ కమిషనర్, సభ్యులుగా చెన్నై జిల్లా కలెక్టర్, చెన్నై నగర పోలీస్ కమిషనర్, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్, కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి, నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజనీర్ తదితరులున్నారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం

వేలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని హైదర్‌పురంలో గంగమ్మ ఆలయంలో ఆదివారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం గర్భాలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాజేంద్రన్, ఆనందన్, ఆలయ అధ్యక్షుడు వెంకటేషన్, కరుణాకరన్, సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షంచారు.

పాతసామాన్ల గోదాములో అగ్ని ప్రమాదం

● భారీగా ఆస్తినష్టం


మంటల్లో దగ్ధమవుతున్న పాతసామాన్లు

టి.నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలో పాతసామాన్ల గోదాములో సోమవారం వేకువజాము సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో రూ.20లక్షల విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. గుమ్మిడిపూండి సమీపంలో ఉన్న సూరావారి కండిగ గ్రామంలో కమల్ అనే వ్యకి టన్నులకొద్దీ పాత ఇనుములు, రేకుల డబ్బాలు, పెయింట్ డబ్బాలు, ప్లాస్టిక్ పరికరాలను భద్రపరిచే గోదాము నడుపుతున్నారు. సోమవారం వేకువజాము ఐదు గంటల సమయంలో ఆ గోదాములో ఉన్న ఓ గదిలో మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఆ గదితోపాటు గోదాములో మంటలు వ్యాపించాయి. ఆ మార్గంలో వెళ్తున్న స్థానికులు గమనించి వెంటనే గోదాము యజమానికి తెలిపారు. గోదాము యజమాని కమల్ వెంటనే అక్కడకు చేరుకుని సిప్కాట్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సభ్యులు ఫైరింజన్‌తో వెళ్ళి రెండు గంటలపాటు పోరాడి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించిన గుమ్మిడిపూండి సిప్కాట్ పోలీసులు అగ్ని ప్రమాదంలో రూ.20లక్షల విలువైన పరికరాలు దగ్ధమైనట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి

● అధికారులకు మంత్రి దురైమురుగన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి దురైమురుగన్ అధ్యక్షతన సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నగరాభివృద్ధి కోసం డీఎంకే ప్రభుత్వం ఎంతో పాటుపడుతుందని, నాణ్యతలో రాజీలేకుండా నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, మేయర్ సుజాత సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న అగ్ని నక్షత్రం

పెరంబూర్, మే 26(ఆంధ్రజ్యోతి): అగ్ని నక్షత్రం బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో, రాష్ట్రంలో ఎండ తీవ్రత తగ్గే అవకాశముంది. మార్చి నుంచి రాష్ట్రంలో ఎండ తీవ్రత ప్రారంభమైంది. వేసవిలో ఎండలు అధికంగా ఉండే అగ్ని నక్షత్రం ఈ నెల 4వ తేది నుంచి ప్రారంభమైంది. ఆ సమయంలో తూర్పు, పశ్చిమం వైపు నుంచి వీచే గాలుల దిశ తరచుగా మారుతుండడంతో రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు కురిశాయి. జూన్ మొదటి వారంలో కేరళలో ప్రవేశించాల్సిన నైరుతి రుతుపవనాలు కూడా వారం రోజుల ముందే ప్రవేశించాయి. రుతుపవనాలు రాష్ట్రంలోనూ విస్తరించే అవకాశముంది. అగ్నినక్షత్రం బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో, ఎండ తీవ్రత తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు.

మావోయిస్టులపై దాడులకు వ్యతిరేకంగా 2న వామపక్షాలు, డీపీఐ నిరసన

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు మావోయిస్టులపై సాగిస్తున్న అమానుష దాడులు విరమించుకోవాలని, వారితో చర్చించాలని తదితర డిమాండ్లతో జూన్ 2న నగరంలో సీపీఎం, సీపీఐ, డీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీల నేతలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో... నక్సల్స్ నిర్మూలన పేరుతో కేంద్రం, బీజేపీ నేతృత్వంలోని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటించినా, దాడులు కొనసాగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్రం, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ, మావోయిస్టులతో చర్చలు జరిపాలని డిమాండ్ చేస్తూ నగరంలో జూన్ 2న నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఆ పార్టీలు ప్రకటించాయి.

తిరువాన్మియూరు ఏటీఎంలో దోపిడీయత్నం

● ఉత్తరాదికి చెందిన ముగ్గురి అరెస్టు


అరెస్టయిన కులదీప్‌సింగ్, బ్రిజ్‌బన్, సుమంత్ యాదవ్

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరులోని ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నించిన ఉత్తరాదికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. తిరువాన్మియూరులోని తిరువళ్లువర్‌నగర్ వద్దనున్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో ముగ్గురు దుండగులు దోపిడీ యత్నానికి పాల్పడ్డారు. ఈ విషయం ముంబయిలో ఉన్న ఆ బ్యాంక్ కంట్రోల్ రూమ్ అధికారులకు తెలిసింది. దీంతో చెన్నైలో ఏటీఎంలో నగదు నింపే సంస్థ ప్రతినిధికి ఫోన్‌చేసి ఆ ఏటీఎంలో చోరీ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసి తనిఖీ చేయమన్నారు. ఆ మేరకు ఆ ప్రతినిధి పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ ఏటీఎం కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దుండగులను గుర్తించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కులదీప్‌సింగ్ (26), బ్రిజ్‌బన్ (30), సుమంత్ యాదవ్ (33) అనే వారిని అరెస్టు చేసి వారిదగ్గర దోపిడీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ దుండగులు ఇదివరకే నగరంలోని పలు ఏటీఎం కేంద్రాల్లో దోపిడీ యత్నానికి పాల్పడినట్లు కనుగొన్నారు.

తిరుత్తణి ఆలయ ఉద్యోగిపై దాడి


బాలకృష్ణన్

తిరుత్తణి, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ ఉద్యోగిపై దాడిచేసిన వ్యవహారంలో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. తిరుత్తణి ఆలయ కొండ దిగువన 'శరవణ పొయిగై' విడిది గృహంలో బాలకృష్ణన్ పనిచేస్తున్నాడు. గదులు తీసుకున్న భక్తులు ఇచ్చిన నగదు లెక్కిస్తున్న బాలకృష్ణన్, విడిది గృహంలోని ఓ గదిలో మద్యం సేవిస్తున్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి మద్యం సేవిస్తున్న వారిని ఇదేమని ప్రశ్నించారు. దీంతో బాలకృష్ణన్‌పై దాడిచేసిన ముగ్గురు, అతడి దగ్గర ఉన్న రూ.30 వేలు దోపిడీ చేసేందుకు యత్నించారు. ఈ ఘటనలో బాలకృష్ణన్ తలకు గాయాలు కావడంతో అతడిని తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణన్ ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు పరామర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా లోకేష్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య


గజలక్ష్మి (ఫైల్‌ఫోటో)

తిరుత్తణి, మే 26 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్లిపట్టు సమీపంలో చోటుచేసుకుంది. వెంకట్రాజుకుప్పం గ్రామానికి చెందిన మునిలక్ష్మి కుమార్తె గజలక్ష్మి (25) ఈచంపాడికి చెందిన గోవిందరాజ్ కుమారుడు ప్రవీణ్ (28) 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న గజలక్ష్మి, ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ప్రవీణ్ ఫిర్యాదు ఆధారంగా పల్లిపట్టు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేయండి

● మాజీ మంత్రి సి.విజయభాస్కర్

వాషర్‌మెన్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్ష హెచ్చరికలు జారీచేసిన జిల్లాల్లోని అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక జ్వర శిబిరాలు ఏర్పాటుచేయాలని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సి.విజయభాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... దేశవ్యాప్తంగా తక్కువగా ఉన్న కరోనా కేసులు ఒకే వారంలో నాలుగు రెట్లు పెరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెబుతున్న ఆరోగ్య శాఖ, కరోనా వ్యాప్తిని అడ్డుకొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రాంతాలు, నీటి వనరుల్లో కరోనా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.

మాదకద్రవ్యాలపై నిషేధం పొడిగింపు

వాషర్‌మెన్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): గుట్కా, పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం, 2023 మే 23వ తేది నుంచి నికోటిన్ కలిగిన మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, నిషేధకాలం ఈ నెల 23వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, 2025 మే 23వ తేది వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నా కుమార్తె తండ్రి పేరు వెల్లడించను : వనిత


తన కుమార్తె జోవిక తండ్రి పేరు మాత్రం వెల్ల డించనని నటి వనిత స్పష్టం చేశారు. అయితే, తన కుమార్తె త్వరలోనే హీరోయిన్‌గా తెలుగులో ఎంట్రీ ఇవ్వనుందని, ఇప్పటికే రెండు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆమె వెల్లడించారు. వనిత విజయకుమార్, రాబర్ట్ మాస్టర్, స్రిమన్, షకీలా, చెఫ్ దాము, ఆర్తి, గణేష్, పవర్ స్టార్ శ్రీనివాసన్, గుంతాజ్ తదితరులు నటించిన చిత్రం 'మిసెస్ అండ్ మిస్టర్'. వనిత ఫిల్మ్ ప్రొడక్షన్స్ పతాకంపై కుమార్తె జోవిక నిర్మించగా, వనిత దర్శకత్వం వహించారు.ఈచిత్రం ఆడియో రిలీజ్ ఆదివారం రాత్రి నగరంలో జరిగింది.సినీ ప్రముఖులు ఆర్కే సెల్వమణి, ఏ.వెంకటేష్, తిరు ఇలవరసు, లింగుస్వామి, మదియళగన్, కిరణ్, ఫాతిమా బాబు గాయత్రి, యోగేంద్రన్, సైంధవి, అనుమోహన్, శక్తి వాసు, నాంజిల్ విజయన్, మదురై ముత్తు, కేపీవై బాలా తదితరులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు.ఇందులో నటి వనిత మాట్లాడుతూ, 'ఇది ఒక మంచి సందేశాత్మక చిత్రం. నా కుమార్తె సొంతంగా నిర్మించారు. ఆమె హీరోయిన్‌గా మొదట తెలుగులో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇప్పటికే రెండు చిత్రాల్లో నటించేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. నా కుమార్తెను కూడా ఆదరించాలని మీడియానేకోరుతున్నాను. సాధారణంగా ఏ స్త్రీ అయిన గర్భవతిగా ఉన్న సమయంలో ఇంట్లో కంటే తన భర్త వద్ద ఉండటానికే ఇష్టపడుతుంది. కానీ, నేను ఒంటరిగా అమెరికాలో ఉండిపోయాను. అక్కడ జోవికాకు జన్మనిచ్చాను. ఆస్పత్రి సిబ్బంది తండ్రి పేరు చెప్పాలని కోరగా, నా భర్త పేరు కుమార్తె సర్టిఫికెట్‌లో ఉండటం నాకు ఇష్టం లేదు. అందుకే నా తండ్రి పేరు వచ్చేలా జోవికా విజయకుమార్ అని పెట్టారు. నాతో పాటు నా కుమార్తె గురించి పత్రికల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలను చూస్తుంటాను' అని వివరించారు. అతిథుల్లో ఒకరైన దర్శకుడు వసంత బాలన్ మాట్లాడుతూ, 'వనిత వ్యక్తిగత జీవితమే ఒక జీవన పోరాటం. నిజ జీవితంలోనే అనేక కష్టాలను ఆమె ఎదుర్కొన్నారు. పురుషాధిక్య సమాజంలో ఒక మహిళను విమర్శన వస్తువుగా చూడటం బాధగా ఉంది. ఇలాంటి సమాజంలోనూ సినిమా టైటిల్‌ను 'మిసెస్ అండ్ మిస్టర్' అని పెట్టడం ఓ సాహసమే. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిరచారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

హృదయాన్ని ముక్కలు చేస్తున్న పైరసీ

● హీరో సూరి



చిత్రపరిశ్రమను పైరసి పట్టిపీడిస్తుంది. దీనివల్ల అనేకమంది హృదయాలు గాయపడుతున్నాయని హీరో సూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మామన్' తాజాగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. అదేసమయంలో ఈ సినిమా పైరసీ బారినపడింది. దీనిపై హీరో సూరి మాట్లాడుతూ, ' సినిమా అనేది కేవలం వినోదం కోసమే కాదు. అది చాలా మంది కల, కృషి కలయిక. సినిమా తీయడమంటే బిడ్డ ప్రసవంతో సమానం. సినిమా హిట్ అయినా ఫెయిల్ అయినా అది జర్నీతో సమానం. ఇలా ఎన్నో ప్రయత్నాలు చేసి, సినిమా విడుదల చేస్తే దానిని కొందరు పైరసీదారుల చేతుల్లోపడి నాశనమైపోతోంది. ఇది హృదయాన్ని ముక్కలు చేస్తుంది. దయచేసి పైరసీని ప్రోత్సహించవద్దు' అని సూరి పిలుపునిచ్చారు.

డాడీతో కలిసి నటించేందుకు సిద్ధం

● శ్రుతి హాసన్


కమల్ హాసన్‌తో శ్రుతి

మా నాన్నతో కలిసి నటించేందుకు తాను సిద్ధంగానే ఉన్నానని, అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నానని కమల్‌హాసన్ కుమార్తె , నటి శ్రుతి హాసన్ పేర్కొన్నారు. మణిరత్నం - కమల్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'థగ్‌లైఫ్' చిత్రం జూన్ 5వ తేదీ విడుదలకానుంది. ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇందుకోసం నగరానికి చేరుకు సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'కూలీ' డబ్బింగ్ జరుగుతోంది.. రజనీకాంత్‌తో కలిసి నటించడం సరికొత్త అనుభవాన్ని ఇచ్చింది. సినిమా నాకు బాగా నచ్చింది. అభిమానులు సైతం ఎంజాయ్ చేస్తారు. 'థగ్‌లైఫ్'లో ఓ పాట పాడేందుకు అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు ఏఆర్.రెహ్మాన్‌కు థ్యాంక్స్. 'థగ్‌లైఫ్' అద్భుతంగా ఉంది. అభిమానులతో కలిసి ఈ సినిమా చూస్తాను. డాడీ నుంచి పిలుపు రావడమే ఆలస్యం... ఆయన చిత్రంలో నటించేందుకు నేను ఎల్లవేళలా సిద్ధం. హీరో విజయ్ రాజకీయ ప్రవేశానికి అభినందనలు' అని శ్రుతి హాసన్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

రూ.వంద కోట్ల వసూళ్ల దిశగా 'టూరిస్ట్ ఫ్యామిలీ'


'టూరిస్ట్ ఫ్యామిలీ'లో ఓ దృశ్యం

డెబ్యూ డైరెక్టర్ అబిషన్ జీవింత్ దర్శకత్వంలో శశికుమార్, సిమ్రన్ జంటగా నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' కలెక్షన్ల పరంగా రూ.వంద కోట్ల క్లబ్‌కు చేరువకానుంది. ఈ నెల ఒకటో తేదీన విడుదలైన ఈ చిత్రం అంచనాలకు మించి విజయాన్ని సొంతం చేసుకుంది. కలెక్షన్ల పరంగా ఇప్పటికే రూ.75 కోట్లు క్రాస్ చేసి, రూ.100 కోట్ల దిశగా వెళ్తోంది. ఇప్పటివరకు వసూలు చేసిన మొత్తంలో కేవలం తమిళనాడులోనే రూ.55 కోట్లకు పైగా ఉండటం గమనార్హం. అలాగే, మే 25వ తేదీతో విజయవంతంగా 25వ రోజు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంతో పాటు హీరో సూర్య 'రెట్రో' మూవీ విడుదలైంది. ఆ చిత్రం కూడా ప్రేక్షకాదారణ పొందినప్పటికీ 'టూరిస్ట్ ఫ్యామిలీ'కి మాత్రం ప్రేక్షకులు ఇప్పటికీ బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

పళని ఆలయంలో బోగర్ జయంతి వేడుకలు

● మరకత లింగానికి ప్రత్యేక పూజలు



టి.నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయంలో నవపాషాణంతో మూలవిరాట్టును రూపొందించిన అష్టాదశ సిద్ధపురుషుల్లో ఒకరైన బోగర్ పెరుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో భక్తులు మూలవిరాట్టును దర్శించుకున్న తర్వాత ప్రత్యేక సన్నిధిలో ఉన్న బోగర్ పెరుమాన్ దర్శించుకోవడం ఆనవాయితీ. ప్రతియేటా వైయ్యాశి నెల భరణి నక్షత్ర దినాన బోగర్ సిద్ధపురుషుడి జయంతిని ఆలయంలో నిర్వహిస్తారు.. ఆ మేరకు ఆ ఆలయంలో బోగర్ సన్నిధిలో మరకత లింగానికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సన్నిధి మండపంలో మరకతలింగాన్ని ఉంచి ఆలయ శైవ పండితులు 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత పుష్పాలతో మరకతలింగాన్ని అలంకరించి దీపారాధన జరిపారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తిరుచెందూర్‌లో వెనక్కి మళ్లిన సముద్రం


సముద్రం వెనక్కి వెళ్లడంతో బయటపడిన పాచి పట్టిన రాళ్లు

పెరంబూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో సముద్రం 60 అడుగుల వెనక్కి వెళ్లింది. సాధారణంగా తిరుచెందూర్‌లో సముద్రం అమావాస్య, పౌర్ణమి తదితర రోజుల్లో వెనక్కి, ముందుకు జరుగుతోంది. ఈ నేపథ్యంలో, అమావాస్య ప్రారంభ ఘడియలు కావడంతో, సోమవారం ఉదయం సముద్రం 60 నుంచి వంద అడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, సముద్రం అడుగున ఉన్న పాచిపట్టిన రాళ్లు, సముద్రపు జీవులు బయటపడ్డాయి. బండరాళ్లపై నిలబడి సెల్ఫీలు తీసుకున్న భక్తులు, యధావిధిగా పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

సాంకేతిక లోపంతో కువైట్ విమానం రద్దు

● ప్రయాణికుల ఆగ్రహం

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి కువైట్‌కు బయలుదేరిన ప్రైవేటు ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఆ విమానం ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.50 గంటలకు రన్‌వేలో టేకాఫ్ అవుతుండగా సాంకేతిక లోపాన్ని పైలెట్ కనుగొని కంట్రోల్ రూంకు సమాచారం ఇచ్చారు. అధికారుల సలహా మేరకు ఆ విమానం టేకాఫ్ చేయలేదు రెండు గంటలపాటు విమానంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని చక్కదిద్దేందుకు ఇంజనీర్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆ విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అప్పటి వరకు ఓర్పుతో ఉన్న ప్రయాణికులంతా వారిపై మండిపడ్డారు. వీరిని అధికారులు శాంతింపజేసి స్థానిక హోటళ్లలో బసకల్పించారు.

దుబాయ్ విమానంపై లేజర్ కిరణాలు...

ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి దుబాయ్ నుంచి వచ్చిన విమానం లాండింగ్ అవుతుండగా పరంగిమలై ప్రాంతం వైపు నుంచి లేజర్ కిరణాలు కాక్‌పీట్‌పై పడ్డాయి. దీంతో ఆ విమాన పైలెట్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. వెంటనే ఆ కిరణాలు పడకుండా చాకచక్యంగా విమానాన్ని ల్యాండింగ్ చేశారు. రెండేళ్ల క్రితం కూడా ఈ విధంగానే గుర్తు తెలియని వ్యక్తులు లేజర్ కిరణాలు వేసి విమానాలు ల్యాండింగ్ కాకుండా ఇబ్బంది కలిగించారు. ప్రస్తుతం లేజర్ కిరణాలు వచ్చిన పరంగిమలై వైపు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఊటీ ఫ్లవర్ షోకు విశేషాదరణ

వాషర్‌మెన్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఊటీ ఫ్లవర్ షోను 1.84 లక్షల మంది వీక్షించారని అధికారులు తెలిపారు. నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్క్‌లో వేసవి ఉత్సవాల్లో భాగంగా 127వ పుష్ప ప్రదర్శనను ఈ నెల 15వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో సుమారు 2 లక్షల పూలతో పలు ఆకృతులు రూపొందించగా, సుమారు 40వేల పుష్పాలుంచారు. ఈ ప్రదర్శన ఆదివారంతో ముగిసిందని జిల్లా యంత్రాంగం ప్రకటనలో తెలిపింది.

జూలై నెలాఖరులో కూత్తంబాక్కం బస్టాండ్ ప్రారంభం

● మంత్రి పీకే శేఖర్‌బాబు



లజ్ అవెన్యూ వద్ద సామాజిక కేంద్రానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మైలాపూరు ఎమ్మెల్యే డి.వేలు తదితరులు - కుత్తంబాక్కం బస్టాండు ప్లాట్‌ఫామ్

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): కూత్తంబాక్కం బస్టాండు జూలై నెలాఖరులోగా ప్రారంభమవుతుందని సీఎండీఏ ఇన్‌చార్జ్ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. సోమవారం ఉదయం మైలాపూరు లజ్ అవెన్యూ వద్ద రూ.8.25 కోట్లతో నిర్మించనున్న బహుళ ప్రయోజనాల సామాజిక కేంద్రానికి మంత్రి పీకే శేఖర్‌బాబు, మైలాపూరు ఎమ్మెల్యే డి.వేలు, గృహ సదుపాయ, నగరాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి కాకర్ల ఉష భూమిపూజ నిర్వహించారు. ఆ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ... చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సౌత్ చెన్నై, సెంట్రల్ చెన్నై ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, ఉద్యానవనాలు, సామాజిక సంక్షేమ కేంద్రాలు, గ్రంథాలయాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులన్నీ ఈ యేడాది ఆఖరులోగా పూర్తవుతాయని చెప్పారు. ఇక నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు వూందమల్లి సమీపం కుత్తంబాక్కం హైటెక్ బస్ టెర్మినల్ నిర్మాణ పనులు జూలై ఆఖరుకల్లా పూర్తవుతాయని ఆయన చెప్పారు. రూ. 414 కోట్లతో 24.80 ఎకరాల విస్తీర్ణంతో ఈ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. 136 బస్సులు నిలిచేలా, 44 వాణిజ్య దుకాణాలు, డార్మెట్రీలతో సకల సదుపాయాలతో ఈ బస్ టెర్మినల్ ప్రజలకు సేవలందించబోతున్నదని చెప్పారు.

ప్రజలు డీఎంకేనే కోరుకుంటున్నారు

● మంత్రి దురైమురుగన్

వేలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మళ్ళీ డీఎంకే ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి నియోజకవర్గంలోని లాలాపేట పంచాయతీలో ప్రభుత్వాస్పత్రిని మంత్రి దురైమురుగన్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ జగద్రక్షగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దురైమురుగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమార్థం పలు పథకాలను అమలుపరుస్తోందన్నారు. అనంతరం మహిళలకు ప్రభుత్వ సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు.


చెక్కు అందజేస్తున్న మంత్రులు దురైమురుగన్, గాంధీ, ఎంపీ జగద్రక్షగన్ తదితరులు


శరీరానికి శూలాలు గుచ్చుకుని వస్తున్న భక్తులు

తిరుత్తణిలో కృత్తిక పూజలు

● కావళ్లు మోసుకుంటూ వచ్చిన భక్తులు


ఉత్సవమూర్తులకు దీపారాధన

తిరుత్తణి, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యతో పాటు కృత్తిక రావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి, స్వామివారికి బంగారు కవచం ధరింపజేసి దీపారాధన చేపట్టారు. భక్తులు శరీరానికి శూలాలు గుట్టుకుని పుష్ప, నెమలి కావళ్లు మోస్తూ ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. చెన్నై వాషర్‌మెన్‌పేటకు చెందిన భక్త బృందం పదో ఏడాది కూడా భక్తి పాటలు ఆలపిస్తూ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తులు వెండి నెమలి వాహనంపై మాఢవీధుల్లో విహరించారు. ఈ వేడుకల్లో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి సుమారు రెండు గంటలకు పైగా క్యూలైన్లలో వేచి స్వామి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు.

కలుపుమొక్కలకు సరికొత్త మందు 'ట్యాగ్ ప్రాక్సీ'

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): పంటల సంరక్షణ, మొక్కల పోషకాహారాల ఉత్పత్తిలో పేరొందిన ట్రాపికల్ అగ్రోసిస్టమ్ (ఇండియా) సంస్థ దేశవ్యాప్తంగా కలుపుమొక్కల తొలగింపు కోసం ట్యాగ్ ప్రాక్సీని ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు వీకే జావీర్ తెలిపారు. ఈ కొత్త రకం మందు ద్వారా పంటలో కలుపును సునాయాసంగా తొలగించవచ్చన్నారు. అంతే కాకుండా కలుపుమొక్కల తొలగింపు కోసం పెట్టే కూలీ ఖర్చు బాగా తగ్గుతుందన్నారు. ఈ మందును ఒకసారి పిచికారీ చేస్తే చాలని కలుపు మొక్కల బెడద ఉండదని కాలం, శ్రమ ఆదా అవుతుందని వివరించారు.

48 గంటల్లో తొలగించాలి...

లేకుంటే లీగల్ చర్యలు : కెనీషా ఫ్రాన్సిస్



అడయార్, మే 26 (ఆంధ్రజ్యోతి): తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కంటెంట్, అసత్య కథనాలు, వీడియోలను 48 గంటల్లో తొలగించాలని లేనిపక్షంలో లీగల్ నోటీసులు పంపుతామని బెంగళూరుకు చెందిన గాయని కెనీషా ఫ్రాన్సిస్ హెచ్చరించారు. ఈ విషయంపై ఆమె తరఫు న్యాయవాది ఓ ప్రకటన విడుదల చేశారు. 'కెనీషా గురించి వార్తా కథనాలు, వీడియోలు, అసభ్యకరమైన ఫొటోలను 48 గంటల్లో తొలగించాలని అందులో పేర్కొన్నారు. కాగా, హీరో రవి మోహన్ - ఆర్తి రవి దంపతులు విడిపోవడానికి గాయని కెనీషా ఫ్రాన్సిస్ అంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో నగరంలో జరిగిన ఓ నిర్మాత కుమార్తె వివాహానికి రవి మోహన్ - కెనీషా ఫ్రాన్సిస్ జంటగా హాజరుకావడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లయింది. దీంతో కెనీషాకు సంబంధించి అనేక కథనాలు, వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదేసమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి చంపేస్తామని, అత్యాచారం చేస్తామంటూ బెదిరించినట్టు కెనీషా వెల్లడించారు. ఈ నేపథ్యంలో తనకు సంబంధించిన అన్ని రకాల వీడియోలు, కంటెంట్‌లను 48 గంటల్లో తొలగించాలని ఆమె తన న్యాయవాది తరఫున కోరారు.



చెన్నైలోని చేపాక్ కలైవానర్ అరంగంలో జీసీసీ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల విలువైన బాండ్లను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ చేసేలా గంట మోగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

బ్యాడ్మింటన్ ఇండియా ఫ్యాన్లీ ప్రారంభం



వాషర్‌మెన్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ బ్యాడ్మింటన్ కమ్యూనిటీని ఒకే వేదికపైకి తీసుకురావడానికి 'ఫ్యాన్లీ' పేరుతో వేదిక ఆవిష్కృతమైంది. ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్, నాస్కామ్‌లో వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి సిరా, ఫ్యాన్లీ సహవ్యవస్థాపకులు శ్రీనివాసన్ బాబు, శరవణన్ కనగరాజు తదితరులు ఇటీవల దీనిని నగరంలో లాంఛనంగా ప్రారంభించారు. అగ్రశ్రేణి భారత ఆటగాళ్లు, వర్ధమాన తారలు, ఉత్సాహభరితమైన అభిమానులకు ఒకే ఆకర్షణీయమైన వేదికపై ఏకం చేయడమే లక్ష్యంగా దీనిని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.


'నాన్ ముదల్వన్ పథకం' ద్వారా శిక్షణ పొంది యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఐఏఎస్ శిక్షణకు ఎంపికైన ఫ్లెస్సీ సిదేజిల్, ఎంవీ నిలాభారతి, ఆర్ అరవింద్‌కుమార్, మధుసూర్యా జే బీబీషా, పి. రామ్ ప్రకాష్, సి. శ్వేతా, పి. అరుణ్ శీనివాసన్, సంతోష్‌కుమార్, ధర్మ దురై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం.


మండలి బుద్ధప్రసాద్


సురేఖవాణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి రావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, సినీనటి సురేఖవాణి, కర్ణాటకకు చెందిన మల్లికార్జున ముత్యా(అప్పాజీ), హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మెన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు.


కొండ విజయ్‌కుమార్, మల్లికార్జున ముత్యా


సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,538

తలనీలాలు సమర్పించినవారు: 37,339



ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 268 ఫిర్యాదులు ● ప్రజాసంఘాల ధర్నాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని, పరిష్కారం కానివాటికి కారణాలు చెప్పాలని కలెక్టర్ సూచించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 268 అర్జీలు అందగా అందులో వివిధ భూసమస్యలపై 150 వినతులు రెవెన్యూశాఖకే రావడం గమనార్హం. వచ్చిన సమస్యల్లో కొన్ని..

గుట్ట కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు జయచంద్ర, సుమన్ డిమాండు చేశారు. ఈ మేరకు వీరు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం వద్ద మట్టిని తవ్వి వందలట్రిప్పులు తీసుకెళుతున్నారన్నారు. దీంతో రామాపురం నుంచి పచ్చికాపల్లం వరకు కొండలన్నీ మాయమై పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఒక ట్రిప్పు ఎర్రమట్టిని సుమారు రూ.30వేలకు అమ్ముకుంటున్నారన్నారు. ఇక ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎర్రమట్టి అక్రమ రవాణాదారులు, గుట్టలు చదునుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వాకాడు చెరువును చెరబట్టారు

కొంతమంది ఆక్రమణదారులు వాకాడు చెరువును కబ్జాచేసి వ్యవసాయం చేస్తుండటంతో నీటిపారుదల ఆగిపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వెంకటశేషయ్య, నాగరాజు, హరి, జనార్దన్, రమణయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి చెరువును కాపాడాలని కోరారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఎస్టీ వర్గీకరణచేసి యానాదులకు న్యాయం చేయండి

ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలంటూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గిరిజన జాతుల్లో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచులయ్య అన్నారు. ఎస్టీ వర్గీకరణతోనే యానాదులు అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, తలపల మల్లికార్జున, వెంకటరమణ, చెంగల్రాయులు, రామయ్య, రేవతి, రాములమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోతాపురికి కిలో రూ.15 కనీస ధర కల్పించాలన్నారు. ఏ రోజు ధరలు ఆరోజు మార్కెట్‌లో ప్రదర్శించాలని డిమాండు చేశారు. సాగు భారమై రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ధరలు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని చంద్రశేఖర్, రాము తదితరులు కోరారు.

సర్‌ఛార్జీ, స్టాంప్‌డ్యూటీ నిధులు చెల్లించాలి



తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో భూమి, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి పంచాయతీలకు రావాల్సిన సర్‌ఛార్జీ, స్టాంప్ డ్యూటీ నగదు రెండేళ్లుగా విడుదల చేయడంలేదని సాయినగర్ సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి నెలా జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జీ నగదును క్రమం తప్పకుండా పంచాయతీలకు అందించాలన్నారు.

'విశాఖ' స్టీల్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు హరినాథ్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించకుండా ప్రైవేటు పరిశ్రమలకు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నేతలు రాధాకృష్ణ, జయచంద్ర, రాజా, లోకేష్, సుబ్రమ్మణ్యం, మాధవ్‌కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, చిన్నయాదవ్, యుగంధర్, సాయి లక్ష్మి, సుమన్, చిన్నం పెంచులయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీ అధికారులతో థాయ్ బృందం

శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ రాచా ఆరిబార్గ్ తన సతీమణి నరఫాన్ ఆరిబార్గ్‌తో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేశారు. వారికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం, వ్యాపార ప్రయోజనాల గురించి వారికి వివరించారు. భారత్ - థాయ్‌లాండ్ మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ పర్యటన కీలకపాత్ర పోషిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. థాయ్ కాన్సుల్ జనరల్ తన పర్యటనలో భాగంగా తొలి రోజు శ్రీసిటీ అధికారులతో చర్చలు, సెజ్ పరిసరాలతో పాటు థాయ్ పరిశ్రమలైన రాక్‌వర్త్, మాండలెజ్ పరిశ్రమలను సందర్శించి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రేపు బర్డ్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకున్న డైరెక్టర్ ఛాంబర్‌ను సిద్ధం చేశారు. ఈనెల 28న బర్డ్‌ను స్థాపించిన దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి జగదీష్ బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

శ్రీకాళహస్తి,మే26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కదలికలపై పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారిలో గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మాటు వేసి ముగ్గురుని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని పాడి రైతు మృతి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని పాడిరైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (59) అనే రైతు గేదెలను వెతికే క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నాగయ్యకు వినిడిలోపం ఉండడంతో రైలు రావడాన్ని గుర్తించకపోవడంతో ప్రమాదానికి గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీలకు సంబంధించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్వయం ప్రతిపత్తి గల ఈ రెండు కాలేజీలు సొంతంగానే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించాయి. ఫలితాలను ఆయా కాలేజీల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఫలితాలు ఎస్‌వీఏసీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 88.05 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ప్రకటించారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో 92 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు - కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్


కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఈ లు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్యాడర్లలో ఐదేళ్లు పూర్తి కాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరి కొందరు అధికారుల దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు స్థానాలను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులను వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులకు, ఉద్యోగులకు కూడా చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.


కౌన్సెలింగ్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు అమావాస్య ఘడియలు కలిసి రావడంతో రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 548 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,139, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,220మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,497మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,331, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 246, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 76మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,991 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అల్లకల్లోలంగా సముద్రం


తూపిలిపాళెం సముద్ర తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తూపిలిపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, వైట్‌కుప్పం తీరాలలో వాయుగుండం ప్రభావంతో సముద్రం ముందుకువచ్చిందని మత్స్యకారులు సోమవారం తెలిపారు. వాయుగుండం ప్రభావంతో రెండు గంటలపాటుగా ఎడతెరపిలేకుండా వర్షం పడింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి